తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



తిరుపతి,జులై 25ప్రభాతవార్త:

తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో శనివారం ఉదయం ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ తొలి సారిగా ప్రజా దర్బార్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)కు విశేష స్పందన లభించింది. వివిధ డివిజన్లకు సంబంధించి డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వీధి లైట్లు, సిసిరోడ్లు, పారిశుద్ధం తదితర అంశాలపై అర్జీదారులతో నేరుగా మాట్లాడి వినతులు స్వీకరించారు. సమస్యలకు తక్షణ పరిష్కారం కోసం అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. తిరుపతి వాసులకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఇచ్చిన అవకాశం ప్రజలకు సేవ చేయడానికే అని, ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారి గడప వద్దకు చేర్చడమే నా లక్ష ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కుమారమ్మ, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్,క్లస్టర్ ఇన్చార్జులు దంపూరి భాస్కర్ యాదవ్ , , శ్రీధర్ వర్మ ,మునిశేఖర్ రాయల్ ,మన్నెం శ్రీనివాసులు ,మహిళా అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వెబ్ ఆప్షన్లలో

# తీవ్ర గందరగోళం..

**విద్యార్థుల ఆందోళన**

**గంటల తరబడి తెరుచుకోని వెబ్‌సైట్**

**కౌన్సెలింగ్ కేంద్రాల చుట్టూ విద్యార్థులు, తల్లిదండ్రుల నిరీక్షణ**

**ఉన్నత విద్యామండలి తీరుపై తీవ్ర అసంతృప్తి**




తిరుపతి విద్య జూలై 25 ప్రభాత వార్త

ఈఏపీసెట్-2026 ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ తొలి రోజే తీవ్ర గందరగోళానికి దారి తీసింది. శనివారం నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభమవుతుందని సాంకేతిక విద్యామండలి ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంటర్నెట్ కేంద్రాలు, సచివాలయాలు, కౌన్సెలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అయితే సాయంత్రం వరకు వెబ్‌సైట్ అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.తిరుపతి జిల్లాలోనే సుమారు 20 వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నట్లు సమాచారం. వెబ్ ఆప్షన్ల నమోదు కోసం ఉదయం నుంచే ఎదురుచూసినా రాత్రి 7 గంటల వరకు వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కౌన్సెలింగ్ కేంద్రాల వద్ద నిరాశతో వెనుదిరిగిన పరిస్థితులు కనిపించాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ దశలోనే సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు వెబ్ ఆప్షన్ల ప్రక్రియలోనూ అదే పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు జరుగుతుందని ప్రకటించిన అధికారులు, అందుకు తగిన సాంకేతిక ఏర్పాట్లు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు.వెబ్‌సైట్ ఎందుకు పనిచేయడం లేదని కౌన్సెలింగ్ కేంద్రాల్లో ఆరా తీస్తే తమకు ఎలాంటి సమాచారం లేదని, వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదని మాత్రమే సిబ్బంది సమాధానం చెబుతున్నారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. దీంతో ఉన్నత విద్యా మండలి వ్యవహారశైలిపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు, సాంకేతిక లోపాల కారణంగానే వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఆలస్యమైందని అధికారులు వెల్లడించినట్లు సమాచారం. అయితే విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కౌన్సెలింగ్ ప్రక్రియలో ఇటువంటి లోపాలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## తొలి ఏకాదశిన

# పోటెత్తిన భక్తులు

### కళ్యాణ వెంకన్న ఆలయం భక్తులతో కిటకిట





చంద్రగిరి, జూలై 25 ప్రభాతవార్త:

శ్రీమహావిష్ణువు యోగనిద్రకు ఉపక్రమించే తొలి ఏకాదశి రోజు శనివారంతో కలసి రావడంతో కళ్యాణ వెంకన్న ఆలయం భక్తులతో పోటెత్తింది. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం మహిళల ధీపారాధనలు, పోటెత్తిన భక్త జన సందోహంతో ఆలయ అధికారులు లఘు దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపీనాధ్, సూపరిం టెండెంట్స్ హరి కృష్ణ, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్ స్వయంగా క్యూలైన్లను పర్యవేక్షించారు. విఐపిల తాకిడిని సమయానుకూలంగా నియంత్రిస్తూ సాధారణ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ, శ్రీవారి సేవకుల సేవలను సమర్ధవంతంగా వినియోగించుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

## గోవిందనామాలతో మార్మోగిన తిరుపతి



తిరుపతి,జులై 25ప్రభాతవార్త:

మొదటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుపతి నగరంలో నిర్వహించిన నగర సంకీర్తన భక్తి పారవశ్యంతో సాగింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో వెంకటేశ్వర స్వామివారి నామస్మరణను ప్రజల్లో విస్తృతంగా చాటాలనే సంకల్పంతో గత రెండున్నర సంవత్సరాలుగా ప్రతి శనివారం నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. మొదటి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ఈ వారపు సంకీర్తనకు విశేష స్పందన లభించింది.శనివారం తెల్లవారుజామున గోవిందరాజస్వామి ఆలయ మాడవీధుల్లో వందలాది మంది భజన మండలి సభ్యులు సాంప్రదాయ దుస్తులు ధరించి, నుదుట గోవింద నామాలతో మేళతాళాల నడుమ "గోవింద... గోవింద..." అంటూ లయబద్ధంగా భజనలు ఆలపించారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు వేంకటేశ్వర స్వామివారిని స్తుతిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో గుండాల గోపీనాథ్‌రెడ్డి, మునినాథ రెడ్డి, కొండే చెంగారెడ్డి, ప్రశాంతి,హరిత,దుర్గా శ్రావణి, పావని,శ్రావణి, పద్మావతి, అరుణమ్మ, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కల్పన, పద్మావతి, పార్వతి, జ్యోతి, లక్ష్మి ్మ, సిద్ధమ్మ, సుశీల, , నాగరాజు రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై పలుమార్లు లైంగిక దాడి

**- ఫోటోలు వీడియోలు చూపుతూ బెదిరింపులకు పాల్పడిన నిందితుడు**

**- నిందితుడు అరెస్ట్**

**- బాధితురాలని చికిత్స నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలింపు**

తిరుపతి క్రైమ్, జూలై 25, ప్రభాతవార్త

అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక అపార్ట్మెంట్లో నివసిస్తున్న వివాహిత మహిళను అదే అపార్ట్మెంట్‌కు చెందిన వ్యక్తి పలుమార్లు మహిళ పై లైంగిక దాడి చేసి బెదిరింపులకు పాల్పడిన ఘటన తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు నిందితున్ని అలిపిరి పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అలిపిరి సిఐ రామకిషోర్ సమాచారం మేరకు తిరుపతి ఉపాధ్యాయ నగర్ చెందిన వివాహిక మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఒక అపార్ట్మెంట్లో నివసిస్తున్నారు. అదే అపార్ట్మెంట్‌కి చెందిన గంగాధర్ రెడ్డి ఆమెను ఫోటోలు వీడియోలు తీసి అంతర్జాలంలో పెడతానని బెదిరింపులకు పాల్పడుతూ ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. తీవ్రంగా గాయపడిన మహిళ అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసుల సహకారంతో తిరుపతి రూయ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని సంబంధిత సెక్షన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సిద్దేశ్వర ఆలయంలో రూ:లక్ష చోరీ

రామకుప్పం, జూలై 25 ప్రభాతవార్త

మండల పరిధిలోని చల్దిగానిపల్లి పంచాయతీ బూరుగుమాకులపల్లి గ్రామంలో నెలకొని ఉన్న అంబురు సిద్దేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దొంగలు ఆలయంలో చొరబడి స్వామి వారి విలువైన ఆభరణాలు, వస్తువులు, అమ్మవారి నగలు, తాళిబొట్టు హుండీలోని సుమారు లక్ష రూపాయలు చోరీ జరిగిందన్నారు. పోలీసులు దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను పట్టుకుని ఆలయానికి నష్టమైన వస్తువులను నగదును అప్పగించాలని గ్రామస్తులు కోరారు. ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆరోగ్యకరమైన పదార్థాలను

# విక్రయించకుంటే కఠినచర్యలు

### హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్

తిరుపతి కార్పొరేషన్, జూలై 25 ప్రభాతవార్త:



నగరంలో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు విక్రయించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ హెచ్చరించారు. శనివారం తిరుపతి నగరంలోని వివిధ ప్రదే శాలలో గల క్విక్ కామర్స్, డార్క్ స్టోర్స్ తదితరాల్లో ప్రజా వినియోగానికి సరఫరా చేయు ఆహార పదార్దాల నిలువచేయు స్టోర్లను వెటర్నరీ ఆఫీసర్, తదితరులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నందున వైకుంఠపురం రోడ్డులోని బ్లింక్ ఇట్, కరకంబాడి రోడ్డు భూపాల్ హౌసింగ్ కాలనీ నందుగల బ్లింక్ ఇట్, క్విక్ కామర్స్, డార్క్ స్టోర్ ను, తిరుమల బైపాస్ రోడ్డు ప్రక్కన గల ఇన్ స్టా మార్ట్, క్విక్ కామర్స్ డార్క్ స్టోర్, ఆర్. సి. రోడ్డు, అవిలాల వద్ద గల ఇన్ స్టా మార్ట్ కామర్స్ డార్క్ స్టోర్ ను మరియు ఇతర గ్రాసరీ షాపులను తనిఖీ చేశామని తెలిపారు. ఇందులో భూపాల్ హౌసింగ్ కాలనీ వద్ద గల బ్లింకిట్ కామర్స్, డార్క్ స్టోర్ పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. వైకుంఠపురం రోడ్డు నందు గల స్టోర్ అపరిశుభ్రమైన వాతావరణంలో కుళ్ళిపోయిన, చెడిపోయిన కూరగాయలు ఉండడాన్ని గుర్తించామని తెలిపారు. ఇందులో ప్రజా వినియోగానికి మంచిగా ఉన్న కూరగాయలతో పాటుగా స్టోర్ చేసి క్రాస్ కంటామినేషన్ అయ్యే విదంగా ఉన్నాయని తెలిపారు. చెత్తాచెదారంతో స్టోర్ లోపల, బయట అపరిశుభ్రంగా ఉందని తెలిపారు. రెండు ఇంస్టా మార్ట్, కామర్స్ డార్క్ స్టోర్స్ నందు ఎక్కువ శాతం లో గడువు ముగిసిన ఆహార పదార్థాలను ప్రజల వినియోగార్థం నిలువ ఉంచి వ్యాపారం చేయడాన్ని గుర్తించామని తెలిపారు. ఈ తనిఖీల్లో వెటర్నరీ ఆఫీసర్ గుణ శేఖర్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కంగుంది అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచారం.

కుప్పం జూలై 25 ప్రభాతవార్త.

రామకుప్పం మండలంలో పంట పొలాలపై దాడులు చేసిన ఒంటరి ఏనుగు శనివారం రాత్రి మండలంలోని కంగుంది అటవీ ప్రాంతంలోకి ప్రవేశించింది ఈ ఒంటరి ఏనుగు రాముల గుట్ట చేను ,అంబాపురం, నాయనూరు ప్రాంతాల్లో సంచరించే అవకాశం ఉందని కుప్పం రేంజర్ జయశంకర్ ,డిఆర్ఓ సమీర్ భాష తెలిపారు రైతులు ఎవరు పంట పొలాల వైపు వెళ్లరాదని హెచ్చరించారు.

## వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి, జులై 25ప్రభాతవార్త:

ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాల్ రాజు కాలనీలో ఘటన. మృతుడు నరేంద్ర(29)గా పోలీసులు గుర్తించారు. గత రాత్రి జరిగిన భార్య భర్తల గొడవలో భార్య మున్నిసాకి చేయి ఇరిగిన వైనం. రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మున్నీసా స్టేట్మెంట్ తో పోలీసులు వెతుకులాట. అయితే ఇప్పటికే అతనిపై ఫోక్సో కేసు నమోదు అయి జైలు నుండి బెయిల్ పై విడుదల. పోలీసులు మరోసారి అరెస్టు చేస్తారన్న భయంతో ఇంటిలోనే ఉరి వేసుకొని మృతిచెందాడు. ఆస్పత్రి నుండి ఇంటికి చేరుకున్న మున్నీసా భర్త ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందిన ఘటనను గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. మున్నీస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈస్ట్ ఎస్సై రవి ప్రకాష్ విచారిస్తున్నారు.

## కరవు జిల్లాగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రకటన

**- జడ్పీ సమావేశ భవనం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా**

చిత్తూరు, జులై 25 ప్రభాతవార్త:




తీవ్ర వర్షాభావ పరిసితులు నెలకొనడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాను సత్వరం కరవు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు డిమాండ్ చేశారు. జిల్లాలో నెలకొన్న కరవు పరిస్థితులపై శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతున్న జడ్పీ సమావేశం హాలు ఎదుట సిపిఓ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాను కరవు ప్రాంతంగా ప్రకటిస్తూ జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం కోసం పంపాలని, జిల్లాలో వర్షాలు లేక పచ్చిక బయళ్ళు ఎండిపోయాయని, పశువులకు మేత లభ్యం కాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి మండల కేంద్రాలు, మేజర్ గ్రామాల్లో పశుగ్రాసం పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ప్రజలు మంచినీటి కోసం మైళ్ళ దూరం నడచివెళ్ళి తీసుకురావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, కరవుతో కూలీలు వలస బాట పడుతున్నారన్నారు. ఈ ధర్నా అనంతరం సిపిఐ నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అలాగే ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్, డాక్టర్ వీఎం థామస్, ఆరణి శ్రీనివాసులులను కలిసి జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాను కరవు జిల్లాగా తీర్మానం చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజన్, సిపిఐ నాయకులు గోపినాద్, శివారెడ్డి, రమాదేవి, విజయగౌరి, కె.మణి, గుర్రప్ప, కుమారి, మునిరత్నం, ఫైరోజ్, బాలాజీరావు, జమిలాబీ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల నిఘాలో తొలి ఏకాదశి

**-విమర్శలు,ఆరోపణలకు నిలయంగా మారిన వ్యాసాశ్రమం**

**-సాధువులే పలు డిమాండ్లను ప్రస్తావన**

ఏర్పేడు,జులై 25 ప్రభాతవార్త:



ఒకనాడు ధార్మిక కార్యక్రమాలకు నిలయంగా మలయాళ యతీంద్రుల సారధ్యంలో సుమారు 75 సంవత్సరాలు సాగిన వ్యాసాశ్రమం ప్రస్తుతం వివాదాలు, విమర్శలు,ఆరోపణలకు నిలయంగా మారింది. శనివారం తొలిఏకాదశి సందర్భంగా పూజలు ఏర్పాటు చేయగా ఎటు చూసినా పోలీసు బలగాలు దర్శనమిచ్చాయి. ఇక్కడి ఆశ్రమం కుటుంబ పాలనగా మారిందనే విమర్శలు ఆరోపణలు చోటు చేసుకున్నాయి. ఈ ఆశ్రమంలో పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి పరిపాలన చేపట్టిన తరువాత కుటుంబ పాలనగా మారిందనే పూర్వ విద్యార్థులు, పలువురు సాధువులు ఆరోపించటం చర్చనీయాంశంగా మారింది. ఆశ్రమానికి వ్యవస్థాకులు చుట్టుపక్కల కోట్ల ఆస్తులతో పాటు దేశ నలుమూలల్లో ఆస్తుల్ని సంపాదించారు. ధార్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వగా నేడు ఆ ఆస్తుల్ని అప్పనంగా అమ్ముకుంటూ పబ్బం గడుపుతూ 'ఆశ్రమాన్ని ఓ ప్రైవేటు సంస్థగా' మార్చుకున్నారని, అయితే కోట్ల రూపాయలు విరాళాలు ఇప్పటికి వసూలు చేస్తున్నారని పూర్వ విద్యార్థుల సంఘం ఆరోపించింది. అంతేకాక బాలికల గురుకులంలో ఆడ బిడ్డలపై లైగింకంగా వేధిస్తున్నారనే ఆరోపణలపై పైస్థాయి విచారణకూడా జరిగింది. ఈ నేపధ్యంలో తొలిఏకాదశి పూజల సందర్భంగా ఆశ్రమ పరిరక్షణకు పూర్వ విద్యార్థులు పిలుపునివ్వగా ఆశ్రమ కార్యదర్శి వందలాది మంది పోలీసులను మోహరింపజేసారు. దాంతో ఇక్కడ ఏం జరుగుతుందో అనే ఉత్కంఠత చోటు చేసుకుంది. ఈ నేపధ్యంలో శనివారం పలువురు సాధువులు ఇక్కడ హాజరయ్యారు. అయితే వారిని కూడా పోలీసుల పహారాలో ప్రవేశింపజేయటం అవమానంగా భావించారు. ఈ సందర్భంగా చంద్రగిరికి చెందిన స్వరూపానందగిరి స్వామి మీడియాతో మాట్లాడుతూ ఆశ్రమ సమస్యలను ఆశ్రమంలోనే పరిష్కరించుకో నుటకు నిర్ణయించామన్నారు. ఇక్కడ రాజకీయాలకు అతీతంగా పరిశీలనకు వచ్చిన తమకు చేదు అనుభవాలు ఎదురయ్యాయన్నారు. ముఖ్యంగా సుమారు వంద సంవత్సరాల చరిత్ర కల్గిన ఆశ్రమం నేడు బీడుపడిపోయిందన్నారు. నాడు మళయాళ యతీంద్రులు ట్రస్టును ఏర్పాటుచేసి పారదర్శకంగా పరిపాలన నిర్వహించారన్నారు. మహిళలకు సంస్కృత విద్యను అందించారన్నారు. శనివారం సుమారు వెయ్యిమంది వచ్చినట్లు ప్రకటించారు. ఇక్కడ పరిస్థితి చూసిన తరువాత తరువాత కార్యచరణ ఏమిటన్నది నిర్ణయిస్తామని స్వస్వరూపానంద స్వామి ప్రకటించారు. మొట్టమొదటి పూర్వం గురుదేవులు ఏర్పాటు చేసినట్రస్టు పునఃప్రారంభించాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. సాధువులు ఎండల్లో వస్తే ఆర్‌డిఓ రాలేదని, జనబాహుళ్యం కల్గిన సాధవులు వస్తే కనీసం కూర్చొటానికి కుర్చిలేదని ఆరోపించారు. డివైయస్‌పి సమాధానం చెబుతూ పీఠాధిపతి రక్షణకు వచ్చామని చెప్పటం బాధకరమన్నారు. ఆశ్రమంలో బ్రహ్మచారులు, సాధువులు, సన్యాసుల్లేదన్నారు.అధికారుల తీరును వక్త తప్పు పట్టారు. ఈసమావేశంలో స్వస్వరూపానందగిరిస్వామి, పరమాత్మనాందస్వామి, సంపూర్ణానందగిరి స్వామిలు పాల్గొన్నారు.



## షుగర్ వ్యాధికి క్రమం తప్పకుండా మందులు వాడాలి



పెళ్లకూరు, జూలై 25 ప్రభాత వార్త: బిపి, షుగర్ వ్యాధులున్న రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలని డాక్టర్ చంద్ర మోహన్ రోగులకు తెలియ జేశారు. శనివారం చెంబేడు పిహెచ్‌సి పరిధిలోని రాసనూరు గ్రామంలో 104 సంచార వైద్య శాల శిబిరాన్ని నిర్వహించారు. చిరు వ్యాధులకు చికిత్స చేయ డమే కాకుండా, మధుమేహం, రక్త పోటు రోగులకు రోగ స్థాయి పరీక్షలు చేసి మందులు అందించారు. ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పలు రకాల క్యాన్సర్స్ ప్రాథమిక లక్షణాలు గురించి వివరంగా తెలియజేశారు. దోమల ద్వారా సంభవించే పలు జ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా చర్యలుగా ఇంటి పరిసరాల్లో దోమల ఉత్పత్తి కాకుండా, ప్రతి శుక్రవారం నీటి నిల్వలు ఉన్న పాత్రలను ఎండబెట్టాలని తెలిపారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే మీ గ్రామంలో ఉన్న ఆశా కార్యకర్తకు తెలపాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమోహన్, ఎంఎల్‌హెచ్‌పి సుజాత, హెచ్ ఏ హరిబాబు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తోటల పెంపకం ద్వారా అధిక లాభాలు : ఎంపీపీ



బాలాయపల్లి, జూలై 25 ప్రభాతవార్త : పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు పొందచ్చని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి తెలిపారు. మండలంలోని రామాపురం గ్రామంలో బిజీ రాంజీ పడకధారా పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2.50 ఎకరాల్లో 270 మొక్కలు నాటొచ్చని తెలిపారు. మూడు సంవత్సరాలకు రెండు లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. బిజి రాంజీ పదకం ద్వారా మొక్కలు పెంచుకోవాలని సూచించారు. మండలంలో ఎవరైనా ఉంటే దరఖాస్తులు చేసుకుంటే పథకాన్ని అమలు చేస్తామని ఎంపీడీవో దాసరి నారాయణ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ డి ఇందిరా, ఏపీవో జ్యోతి, ఈసీ మెంబర్ సురేంద్ర, మహిళా రైతులు అంతటి మునెమ్మ, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



సూళ్లూరుపేట, జూలై 25 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలను శనివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమద్ వెంకట రామమూర్తి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి దశావతార అలంకారాన్ని చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన లక్ష తులసీదళాలతో అర్చనను చేపట్టారు. అలాగే షార్ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామిదేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అలంకారాలు చేశారు. శ్రీ బాలాంజనేయ స్వామి దేవస్థానం లోనూ పూజలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

## మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్‌గా మా భాష



సూళ్లూరుపేట, జూలై 25 ప్రభాతవార్త: సూళ్ళూరు పేటకు చెందిన షేక్ మాబాషా మెగా యూత్ ఫోర్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ స్టేట్ కోకన్వీనర్‌గా ఎన్నిక య్యారు. చిరంజీవి సేవా సంఘం ద్వారా అనేక సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజాసేవ కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ అభివృద్ధి కొరకు సూళ్లూరుపేట ప్రాంతంలో విశేషంగా కృషి చేస్తూ వస్తున్నారు. సమాజసేవ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, రక్తదాతగా అందిస్తు సేవలను గుర్తించిన మెగా యూత్ ఫోర్స్ పెద్దలు ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. షేక్ మాబాషా మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా యువతను సంఘటితం చేస్తూ ప్రజాసేవను మరింత విస్తృతం చేస్తానని తెలిపారు. ఆయన రాష్ట్ర కోకన్వీనర్‌గా ఎన్నికవడం మెగా అభిమానులు, వివిధ సేవా సంఘాల ప్రతినిధులుమా భాషకు అభినందనలు తెలిపారు.

## జాతీయ చేనేత...పురస్కారానికి ఎంపికైన నక్క వెంకటేశ్వరరావు



వెంకటగిరి, జూలై 25 ప్రభాతవార్త: పట్టణంకు చెందిన నక్క వెంకటేశ్వరరావును కేంద్ర ప్రభుత్వం చేనేత రంగంలో జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. చేనేత రంగంలో ఆయన ప్రతిభ చాటుతున్నందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. నక్క వెంకటేశ్వర్రావు మార్కెటింగ్ రంగంలో ఆయన ప్రతిభ చాటుతు న్నారు. నక్క వెంకటేశ్వరరావు తండ్రి నక్క వెంకట్రామయ్య 60 సంవత్సరాల క్రితం చేనేత కార్మికుడిగా చిన్నపాటి వ్యాపారంతో జీవనాన్ని మొదలుపెట్టారు. ఆయన వారసులుగా నక్క వెంకటేశ్వరరావు, నక్క దుర్గాప్రసాదులు తమ వంతు వ్యాపార కార్యకలాపాలు సాగిస్తూ వస్తున్నారు. చేనేత వస్త్రాల తయారీని ప్రపంచవ్యాప్తంగా వారు ప్రసిద్ధిగాంచే విధంగా తీసుకెళ్లారు. వెంకటగిరి చీరకు పేటెంట్ హక్కు కల్పించేందుకు నక్క వెంకటేశ్వరరావు కృషి చేశారు. నేషనల్ మెరిట్ అవార్డు, ఆప్కో అవార్డులను కూడా ఆయన కైవసం చేసుకున్నారు. ఆగస్టు నెల ఏడో తేదీ చేనేత దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా నక్క వెంకటేశ్వరరావు అవార్డు అందుకోనున్నారు. పద్మశాలి ఉద్యోగుల సంఘం నాయకులు నాగేశ్వరరావు, తదితరులు ఘనంగా సన్మానించారు. ఇంకా పలువురు నక్క వెంకటేశ్వరరావుని అభినందనలతో ముంచెత్తారు.

## ఆరో రోజుకు చేరిన దస్తా లేకకుల పెన్ డౌన్



వెంకటగిరి, జూలై 25 ప్రభాతవార్త: డిమాండ్ల సాధనకు వెంకటగిరిలో దస్తా లేఖలు ఆరు రోజుల నుండి పెన్డౌన్ కార్యక్రమం చేపట్టారు. దస్తావే లేకకుల సమ్మెతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్తంభించింది. డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాట ఆగదని దస్తా లేక కుల సంఘం నేత మధనంబెడు సురేష్ హెచ్చరించారు. ప్రభుత్వం డిమాండ్లు పరిష్కరించకుండా ఇబ్బంది పెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తా లేకకులు పాల్గొన్నారు.

## నిబద్ధతతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు : కలెక్టర్



చిత్తూరు, జులై 25 ప్రభాతవార్త: ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతలకు అనుగుణంగా జిల్లాలో నిబద్ధతతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడించారు. జడ్పీ సర్వసభ్య సమావేశం అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ప్రారంభమై వివిధ దశల్లో కొనసాగు తున్న అభివృద్ధి పనులకు నిధులు వ్యయం చేసి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పరిస్థితులకు అనుగుణంగా బ్యాలెన్స్ నిధులను పర్యవేక్షిస్తూ, నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో రాజకీయాలకు అతీతంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, మంచినీటి సరఫరా వంటి ప్రజోపయోగ పనులను ఏ ఒక్క పార్టీకో పరిమితం చేయకుండా స్థానిక ఎమ్మెల్యేలు, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర సర్వే ద్వారా పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలతో పాటు అనంతపురం, సత్యసాయి జిల్లాలు హైరిస్క్ జిల్లాలో జాబితాలో వుండటంతో ఈ జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గత కొన్ని సంవత్సరాల గణాంకాలను పరిశీలిస్తే వర్షపాతం సరిగా లేకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో విత్తనాలు, పంటల నాట్లు సాగలేదన్నారు. జిల్లాలో సుమారు 40 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంటల సాగు నమోదు కావాల్సి వుండగా, ప్రస్తుతం కేవలం 20 వేల హెక్టార్ల విస్తీర్ణంలోనే పంటల సాగు అయ్యాయన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఎండబెట్టిన లేదా దెబ్బతిన్న పంటల స్థితిని నిశితంగా అంచనా వేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కరవు మండలాల ప్రకటన, రైతులకు పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుగ్రాసం కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో పశుగ్రాసం కొరత ఏర్పడకుండా తీసుకున్న చర్యలను మరోసారి అమలు చేసి జిల్లాలో పశుగ్రాసంకు ఎలాంటి కొరత ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో ప్రశుగ్రాసం కొరత ఏర్పడకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామన్నారు. ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా చూడటం, రైతులకు అండగా నిలవడం, గ్రామాల్లో మౌళిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా జిల్లా అధికార యంత్రాంగం పని చేస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు.

## నియోజకవర్గంలో సర్ ప్రక్రియ పూర్తి

వెంకటగిరి, జూలై 25 ప్రభాతవార్త:నియోజకవర్గంలో సర్ ప్రక్రియ విజయవంతంగా జరిగినట్లు ఓటర్ల నమోదు అధికారి భరత్ నాయక్ తెలిపారు. రెండు లక్షల 45 వేల 781 మంది ఓటర్లకు డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. 6825 మంది ఓటర్ల సమాచారం లభ్యం కాలేదని చెప్పారు. నియోజకవర్గంలో సర్ ప్రక్రియ విజయవంతంగా జరిగిందని వివరించారు.

## కుంభాగ్రాన అలుగు...భక్తికి నిదర్శనం



శ్రీకాళహస్తి,జూలై 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తికి ప్రతీకగా నిలిచిన పలు అంశాలు గోచరిస్తాయి. ఇందులో ముఖ్యంగా ఆలయంలోని మూల విరాట్లుల ముందు నిలుపు కుంబాగ్రాన అలుగు ఎంతో ప్రధానమైనది. ఈ కార్యక్రమాలను ఆలయ అర్చకులు పురుషోత్తం వారి సహాచరులు నియమనిష్టలతో అచరించారు. ఇదో మహిమాన్వితం. అర్జున తపస్సు పూర్తి అయిన తరువాత అర్జునుడు గ్రామోత్సవం ముగిసిన తరువాత మహిమాన్విత కుంభాగ్రాన అలుగు నిలిపే కార్యక్రమాలను చేపట్టారు. రాత్రిభక్తి శ్రద్ధలతో ఆలయంలోని గర్భగుడి పాండవుల మూల విరాట్టుల ఎదురుగా పసుపుకుంకుమను కలపిన బియ్యాన్ని కుప్పగా పోసారు. దానిపై కుండను ఏర్పాటు చేసారు. దాని అంచున కత్తిని ఎలాంటి అధారం లేకుండా నిలిపినారు. తరువాత పూజలు నిర్వహించారు. ఇదోమహిమాన్విత కార్యక్రమం. ఇందుకు నీటిని గతంలో జీవనది పవిత్ర సువర్ణముఖి నుంచి సేకరించే వారు.కానీ నేడు స్వర్ణముఖి మురికిముఖిగామారటంతో వైష్ణవ కోనేరునుంచి నీటిని సేకరించారు. మేళ తాళాలుపంబజోళ్ళ మోతతో ఈకార్యక్రమాలను నిర్వహించారు.ఈ భక్తి కార్యక్రమాల్లో ఆదివారం అగ్నిగుండ ప్రవేశం చేసే కంకణాలు ధరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో వీక్షించారు.ఈ అలుగు అగ్ని గుండం ప్రవేశం పూర్తి అయినతరువాత గ్రామోత్సవం పూర్తి అయిన తరువాత ఈ కకుండలో నీటితో మూలవిరాట్టులకు అభిషేకం నిర్వహిస్తారు.

## భక్తుల సౌకర్యార్థం కాటేజీలు నిర్మించండి

### -టిటిడి ఇఓకు చైర్మెన్ వినతి



శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయానికి తిరుమలేశుని దర్శనార్థం వచ్చే భక్తుల్లో సగం మంది ఇక్కడకు వస్తున్నారని వారి సౌకర్యార్థం టిటిడి ఇక్కడ కాటేజీలు నిర్మించాలని శ్రీకాళహస్తీశ్వరాలయం ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,ఇఓ బికె వెంకటేశులు టిటిడి ఇఓ రవిచంద్రను అభ్యర్థించారు. శనివారం ఆయన శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో ఇఓ బికె వెంకటేశు,చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. అలాగే స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

**కాటేజీలు నిర్మించండి:**

టిటిడి ఇఓ రవిచంద్ర శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చిన సందర్భంగా ఆయనకు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించిన చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ శ్రీకాళహస్తీశ్వరాలయానికి తిరుమలేశుని దర్శనార్థం వచ్చే భక్తుల్లో సగానికి పైగా ఇక్కడకు వస్తున్నారు. కాబట్టి కైలాసగిరుల్లోని భరద్వాజ తీర్థంలో ప్రస్తుతం శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన అతిధి గృహాలున్నాయని అయితే ఈ సదుపాయాలు సరిపోవటం లేదని టిటిడి కాటేజీలు నిర్మించి భక్తుల సదుపాయాలకు సహకరించాలని కోరారు. అయితే వాటిని పరిశీలిస్తామని భరోసా ఇచ్చిన టిటిడి ఇఓ రవిచంద్ర శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే విఐపిల దర్శనాలకు నాలుగ శ్లాట్లను ఖరారు చేసి అమలు చేయాలని సూచించారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, బోర్డు సభ్యులు పగడాల మురళి, వాకచర్ల గుర్రప్పశెట్టి కుసుమ కుమారి, ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు సి.నాగభూషణంయాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి తదితరులు పర్యవేక్షించారు.

## చంద్రగిరిలో మరుగుదొడ్లు పునరుద్ధరణకు చర్యలు

### స్పెషలాఫీసర్ దుద్దెల అమరేశ్వరి సానుకూల స్పందన



చంద్రగిరి, జూలై 25 ప్రభాతవార్త: ఏళ్ళ తరబడి మూసివేతకు గురై మగువలకు మరుగును కనుమరుగు చేసిన నిస్సహాయ దుస్థితిపై చంద్రగిరి స్పెషలాఫీసర్ దుద్దెల అమరేశ్వరి సానుకూలంగా స్పందించారు. చంద్రగిరి గ్రామ పంచాయతీకి చెందిన మరుగుదొడ్లు సరైన నిర్వహణ లేక రెండేళ్ళ క్రితం మూసివేశారు. గతంలో సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి మరుగు దొడ్లను, పంచాయతీ కాంప్లెక్స్ భవనం పైకప్పును ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విశ్వప్రయత్నం చేసినప్పటికీ రాజకీయ కారణాలు, అధికారుల సహాయ నిరాకరణ కారణంగా కార్య రూపం దాల్చలేదు. ప్రభుత్వం మారినప్పటికీ పూర్తి స్థాయి అధికారులు తమ విధుల నిర్వహణకు సమాయత్తం అయ్యేలోపు మార్పులు జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్‌ల గడువు ముగియడంతో తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరికి స్పెషలాఫీసర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో శనివారం పంచాయతీకి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న క్రమంలో మరుగుదొడ్లు మూసివేతను ఆమె దృష్టికి తీసుకెళ్ళగా సానుకూలంగా స్పందించారు. మహిళల కష్టాలు మహిళకే ఎరుక అందుకే వెంటనే స్పందిస్తూ జూనియర్ అసిస్టెంట్ చంద్రకళకు మరుగుదొడ్లకు సంబంధించి పునరుద్ధరణకు పరిశీలించాలని సూచించారు. మండల కేంద్రమైన చంద్రగిరికి నిత్యం ఎంతో మంది గ్రామీణ ప్రాంతాల నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చి మరుగుదొడ్లు లేక మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా స్థానికంగా దుకాణాలు నిర్వహించుకుంటున్న ప్రతి ఒక్కరూ మరుగుదొడ్ల కోసం అనేక మార్లు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. ఈ విషయమై స్థానిక టిడిపి నాయకులు, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి కొంత చొరవ తీసుకున్నట్లయితే మరుగుదొడ్లు ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం కష్టమేమికాదు.

## బకాసుర వధతో భక్తి రసమయం

### దుర్గసముద్రంలో మహాభారత ఉత్సవాలు వైభవం



తిరుపతి రూరల్, జులై 25 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామంలో వెలసిన శ్రీ ద్రౌపతి సమేత ధర్మ రాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక మహాభారత ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన బకాసుర వధ. కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పురాణాలలో ప్రస్తావించిన మహాభారత ఘట్టమైన బకాసుర వధను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించగా, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆసక్తిగా వీక్షించారు. భీముడు బకాసురుడిని సంహరించే ఘట్టాన్ని నాటకీయంగా ఆవిష్కరించడంతో ప్రాంగణం అంతా హర్షధ్వానాలతో మార్మోగింది. ఈ కార్యక్రమానికి ఉభయదారుడిగా జనార్ధన్ రెడ్డి సేవలు అందించగా, ధర్మకర్త ప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామంలో ఉత్సవ వాతావరణం నెలకొని, సాంప్రదాయ కళారూపాలు, హరికథలు, నాటక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ప్రతి రోజూ నిర్వహిస్తున్న మహాభారత ఘట్టాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ఉత్సవాలు మరికొన్ని రోజులు కొనసాగనున్న నేపథ్యంలో, భక్తులు భారీగా తరలివచ్చే అవకాశముందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా కల్యాణ వేంకటేశ్వరుని ఏకాదశి ఉత్సవం



నారాయణవనం, జూలై 24 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం శుక్రవారం ఏకాదశి ఉత్సవంతో ఆలయం కిటకిట లాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామి వారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్పెక్టర్‌లు భరత్, సిబ్బంది, అర్చకులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏళ్ల కల సాకారం...

## పలమనేరు - మాదిగబండ బస్సు సర్వీస్ ప్రారంభం

### ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన విద్యార్థులు, మహిళలు




పలమనేరు రూరల్, జూలై 25 ప్రభాతవార్త : పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయతీ పరిధిలోని మాదిగబండ గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల కల నేడు సాకారమైంది. స్థానిక ప్రజల చిరకాల విజ్ఞప్తికి స్పందించిన పలమనేరు శాసనసభ్యులు అమరనాథరెడ్డి కృషితో పలమనేరు - మాదిగబండ బస్సు సర్వీస్ శనివారంప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మోలిక సదుపాయాలను కల్పించడం తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు విద్య, వైద్యం, ఉపాధి, ప్రభుత్వ సేవల కోసం సులభంగా రాకపోకలు సాగించేలా రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మాదిగబండ గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యను గుర్తించి సంబంధిత అధికారులతో పలుమార్లు చర్చించి బస్సు సర్వీస్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సౌకర్యంతో గ్రామ ప్రజల ప్రయాణ కష్టాలు తీరడంతో పాటు విద్యార్థులు విద్యాసంస్థలకు, ప్రజలు తమ దైనందిన అవసరాలకు సులభంగా చేరుకోగలరని అన్నారు. అనంతరం మాదిగబండ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించి ఉరుస్తున్న భవనానికి వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను అయన ఆదేశించారు. బస్సు సర్వీస్ ప్రారంభం పట్ల హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు, విద్యార్థులు, మహిళలు తమ ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, ఆర్టీసీ డిపో మేనేజర్ అల్తాఫ్, పీఏసిఎస్ చైర్మన్ లు పెద్దబ్బ, వెంకటముని రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు నాగరాజు రెడ్డి, గణేష్, సెల్వ రాజ్, మంజులమ్మ, రామూర్తి నాయుడు, హేమ సుందరం, రత్నప్పా, భాస్కర్, లక్ష్మినారాయణ తదితరులు ఉన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వరునికి గ్రామోత్సవం



వడమాలపేట, జూలై 25 ప్రభాతవార్త: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా జరిగింది. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన వేదపండితులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి అలంకరణ అనంతరం భక్తులు సర్వ దర్శనం చేసుకున్నారు. ఆషాడమాసంలో తొలి ఏకాదశి కావడంతో భక్తులు అప్పలాయగుంటకు పోటెత్తారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది. ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చగా గంటపాటు ఊయలలూగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడావీధుల్లో విహరించారు. స్థానిక భక్తులు ధూపదీప నైవేద్యాలు స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్, ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, అర్చకులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామిక శక్తుల విజయం

### - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి



తిరుపతి క్రైం, జూలై 25, ప్రభాతవార్త: కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామిక శక్తుల విజయమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి అభివర్ణించారు. శనివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అప్రజాస్వామిక వైఖరికి పరాకాష్ట నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం అని, ఇందులో విద్యార్థి సంఘాలు, విద్యార్థులు నిర్వహించిన పోరాటం దేశంలో సరికొత్త మార్పుకు నాంది పలికిందని పేర్కొన్నారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడినా తమను ప్రశ్నించేవారు ఎవరూ లేరన్న ధీమాతో ఉన్న బిజెపికి, కాక్రోచ్ జనతా పార్టీ ఇచ్చిన షాక్ మామూలు షాక్ కాదని కందారపు మురళి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సగటు భారతీయ విద్యార్థుల ఆకాంక్షలు ఏమిటో ఈ ఉద్యమం ద్వారా వెల్లడి అయిందని, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తన దుర్మార్గపు విధానాలు విడనాడి భారత దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేయాలని, ధరల తగ్గింపుకు పూనుకోవాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని కందారపు మురళి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు సాగించిన అపూర్వ పోరాట ఘట్టాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## పిళ్ళారికోన చెరువులో ఆక్రమణలను తొలగించండి.!

### టిడిపి యువనాయకుడు రెడ్డెప్ప నాయుడు

రామచంద్రాపురం, జూలై 25 ప్రభాతవార్త: పిళ్ళారికోన చెరువులో ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించాలని టిడిపి యువనాయకుడు రెడ్డెప్ప నాయుడు అధికారులను కోరారు. శనివారం పిళ్ళారికోన చెరువు కట్టపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెరువును ఆక్రమించుకున్నట్లు ఆరోపిచారని అన్నారు. చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేయించి, ఆక్రమణల దారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో విశ్వనాథ మందడికి ప్రభుత్వం డికెటి పట్టా మంజూరు చేసిందని, తన పట్టా మేరకు భూమిని అభివృద్ధి చేసుకుంటు న్నట్లు తెలిపారు. చెరువు మొరవను విశ్వనాథ మందడి ఆక్రమించుకున్నాడనేది రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి వాస్తవాలను తేల్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళి మోహన్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

### పాస్ పోర్టు పోయినది

తాళ్ళపాక గంగాధర్ తండ్రి పెద్ద గంగయ్య, గరుగుపల్లి గ్రామం, చిట్వేలి మండలం, తిరుపతి జిల్లా, ఏ.పి. మా ఊరి నుండి చిట్వేలికి ప్రయాణిస్తుండగా చిట్వేలి బస్టాండు లో నా కవరు అందోని పాస్‌పోర్టు నెం. **F8878424** పోయినది. దొరికన వారు **8374478168** నెంబరుకి తెలుపగరు.

# రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ ఉపాధ్యక్షుడిగా హరిప్రసాద్‌కు సత్కారం



తిరుపతి విద్య జూలై 25 ప్రభాత వార్త

వైఎస్సార్సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన మొగరాల హరిప్రసాద్ రెడ్డికి శనివారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద వివిధ సామాజిక, దళిత, విద్యార్థి సంఘాల నాయకులు ఘన సన్మానం నిర్వహించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, హరిప్రసాద్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటూ, కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రజలకు సేవలందిస్తూ అందరి అభిమానాన్ని చూరగొన్న నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన సేవా దృక్పథాన్ని గుర్తించిన పార్టీ అధిష్ఠానం వైఎస్సార్సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబం ఆశీస్సులతో రాష్ట్ర స్థాయి బాధ్యతలు దక్కడం పార్టీ శ్రేణులకు మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను మరింత సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు హరిప్రసాద్ రెడ్డి కృషి చేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సన్మానానికి స్పందించిన మొగరాల హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేసుకుంటూ మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ కార్యక్రమాల విస్తరణకు తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాపూరి ప్రసాద్ బాబు, మాదిగ జనసైన్యం అధ్యక్షుడు సుధాకర్ మాదిగ, ఎన్ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు నగేష్, భారతీయ దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు కొండా యుగంధర్, మాల విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుకుమార్, వాల్మీకి విద్యార్థి సంఘం అధ్యక్షురాలు వినుత, కే.వి. కృష్ణ, కే.ఎం. అర్జున్, శివకుమార్‌తో పాటు పలువురు విద్యార్థి, సామాజిక సంఘాల నాయకులు, వైఎస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొని హరిప్రసాద్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## క్యాంపస్ టు కార్పొరేట్‌పై ఎస్ఓహెచ్ఆర్‌లో అవగాహన సదస్సు

తిరుపతి విద్య జూలై 25 ప్రభాత వార్త



బెంగుళూరుకు చెందిన ఐటీసీ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో తిరుపతి లోని ఎస్ఓహెచ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో క్యాంపస్ టు కార్పొరేట్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ హెచ్ఆర్ మేనేజర్ శంకర్ పాల్గొని కార్పొరేట్ రంగంలో విజయవంతం కావడానికి అవసరమైన నైపుణ్యాలు, ఇంటర్వ్యూ పద్ధతులు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమల అంచనాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత ఉద్యోగాలకు సిద్ధం చేయడమే ఎస్ఓహెచ్ఆర్ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అకాడమిక్ విద్యతో పాటు కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిపుణులతో సదస్సులు, శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో కోటగారం మురళికి ఘన సన్మానం

### ఉద్యోగుల సంక్షేమం, వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తా: మురళి

తిరుపతి విద్య, జూలై 25 ప్రభాతవార్త



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఆల్ యూనివర్సిటీ నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు కోటగారం మురళి జన్మదిన వేడుకలు వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ పరిపాలనా భవనం వద్ద జరిగిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వందలాది మంది ఉద్యోగుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి మురళి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో, వారి సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని పలువురు ప్రశంసించారు. కోటగారం మురళి మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం కోసం తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. వర్సిటీ ప్రతిష్టను మరింత పెంచేందుకు ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కోటగారం మురళిని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. విద్యార్థి సంఘాల నాయకులు, సంఘ సభ్యులు, మహిళా ఉద్యోగులు, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మీడియా కో ఆర్డినేటర్ మనోజ్ సింగ్ ,పలువురు వర్సిటీ ఉద్యోగులు పాల్గొని మురళి సేవలను ప్రశంసించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, వర్సిటీ అభివృద్ధిలో ఆయన మరింత చురుగ్గా పనిచేయాలని కోరారు.

## కడూరు హరిజనవాడలో మురుగు సమస్యకు తక్షణ పరిష్కారం



వరదయ్యపాలెం, జూలై 25, ప్రభాతవార్త

వరదయ్యపాలెం మండలంలోని కడూ రు హరిజనవాడ (హెచ్‌డబ్ల్యూ)లో నెల కొన్న మురుగునీటి సమస్యపై అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. డీవీఎంసీ సభ్యులు గుత్తి త్యాగరాజు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే డిప్యూటీ ఎంపీడీఓ శివకుమార్ స్పందించి అవసరమైన చర్యలు చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీఓ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సిబ్బంది మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రపరిచి, నీరు సాఫీగా పారేలా పారుదల ఏర్పాట్లు చేశారు. మురుగును తొలగించిన అనంతరం గ్రామస్థులు వీధులను నీటితో శుభ్రం చేసి పరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పేందుకు సహకరించారు. ఇటీవల మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల వ్యాప్తి, దుర్వాసనతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. సమస్యపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంతో గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీవీఎంసీ సభ్యులు గుత్తి త్యాగరాజు స్పందిస్తూ, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టిన డిప్యూటీ ఎంపీడీఓ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి మరియు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం కొనసాగిస్తూ ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## వీబీజీ రామ్‌జీ పథకంలో మొక్కలు పంపిణీ

వడమాలపేట, జూలై 25 ప్రభాతవార్త:




వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ పథకంలో శని వారం మొక్కలు నాటారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో రైతుల పొలంలో రెండన్నర ఎకరాల్లో పొలం చుట్టూ కొబ్బరి మొక్కలు నాటారు. అలాగే ఉపాధి కూలీలు పలు చోట్ల వివిధ మొక్కలను నాటారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఏఎవో హంసవేణి, వ్యవసాయశాఖ అధికారి విజయకుమార్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ పార్టీ ఉపాధ్యక్షుడు ధనంజయలునాయుడు, కార్యదర్శి శివరాయల్, రైతులు మురళీనాయుడు, కూలీలు పాల్గొన్నారు.

## వసతి గృహ విద్యార్థినులు విద్యపై దృష్టి సారించాలి..!

### విద్యార్థినుల సౌకర్యమే లక్ష్యంగా "మెటీరియల్స్" పంపిణీ

### ఎంఎల్ఏ పులివర్తి నాని



చంద్రగిరి, జూలై 25 ప్రభాతవార్త:

వసతి గృహ విద్యార్థినులు విద్యపై దృష్టి సారించాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక ఎస్సీ హాస్టల్ ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు శనివారం బెడ్‌షీట్, టర్కీ టవల్, రెండు నైట్ డ్రెస్‌లు, షూస్, సాక్స్, స్వెటర్‌తో కూ డిన మెటీరియల్ కిట్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖలో వసతి సముదాయాల ప్రక్షాళణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థినులకు నాణ్యతతో కూడిన మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. మీరు ఏ రంగంలో స్థిరపడాలని కోరుకుంటున్నారో సాంకేతికంగా సిద్దపడాలని సూచించారు. మొబైల్స్ వినియోగంపై పూర్తి నియంత్రణ కలిగి వుండాలన్నారు. మొబైల్ వినియోగంతో భవిష్యత్ అగమ్యగోచరం కాగలదని హెచ్చరించారు. వసతి గృహంలో ఏవైనా ఇబ్బందులున్నాయా అంటూ ఆరా తీశారు. మీ రక్షణ కొరకు సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌డబ్ల్యుఓ, ఎన్.జయచంద్రారెడ్డి, వెల్ఫేర్ ఆఫీసర్లు చందన, హిమబింధు, బాబు రెడ్డి, ప్రసూన, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా...

### చాక్లెట్లు పంచి విద్యార్థి సంఘాల సంబరాలు

తిరుపతి విద్య, జూలై 25 ప్రభాత వార్త



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ, ఎన్ ఎస్‌యూఐ, నల్సా ఆధ్వర్యంలో తిరుపతిలో వినూత్నంగా సంబరాలు నిర్వహిం చారు. ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల, ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా మెడికల్ కళాశాలల్లో విద్యార్థులకు మెలోడీ చాక్లెట్లు పంపిణీ చేశారుఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పవిత్ర, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి అక్బర్, నల్సా అధ్యక్షుడు సుందర్ రాజు, కాంగ్రెస్ యువజన నాయకుడు ఇరాల లోకేష్ మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థి ఉద్యమం ముగిసిందని భావించరాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న విధానాలపై పోరాటం మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని, జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఈపీ) ఉపసంహరించుకోవాలని, విద్యను కేంద్రీకరించడం, కార్పొరేటీకరణ, వాణిజ్యీకరణ చేసే విధానాలను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెలోడీ చాక్లెట్ల పంపిణీ వెనుక ఉద్దేశాన్ని వివరిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటన సందర్భంగా ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీకి మెలోడీ చాక్లెట్లు అందించిన సంఘటనను ప్రస్తావించారు. అదే చాక్లెట్లను ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేసి తమ విజయోత్సాహాన్ని ప్రతీకాత్మకంగా వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అనిత, రెడ్డి కుమార్, శ్రవంతి, తిప్పయ్యస్వామి, ప్రకాష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఒత్తిడికి దిగొచ్చిన టీటీడీ

### జూనియర్ కళాశాలలకు చేరిన పుస్తకాలు..




తిరుపతి విద్య, జూలై 25 ప్రభాత వార్త

టీటీడీ విద్యాసంస్థల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీపై నెలకొన్న నిరీక్షణకు తెరపడనుంది. ఎస్వీ, పద్మావతి జూనియర్ కళాశాలల విద్యార్థులకు వచ్చే వారంలో పుస్తకాలు అందించేందుకు టీటీడీ అధికారులు ఏర్పా ట్లు చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళా శాలల్లో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు అందుతున్నా, టీటీడీ ఆధ్వర్యంలోని కళాశాలల్లో మాత్రం పంపిణీ ఆలస్యం కావడంతో విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పలుమార్లు ఆందోళన చేపట్టాయి. ఈ అంశాన్ని టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరాయి. విద్యార్థుల విజ్ఞప్తులపై స్పందించిన టీటీడీ అధికారులు ఎస్వీ, పద్మావతి, చెవిటి–మూగ విద్యార్థుల జూనియర్ కళాశాలలకు అవసరమైన పుస్తకాలను సిద్ధం చేశారు. ఇప్పటికే కొన్ని పాఠ్య పుస్తకాలు కళాశాలలకు చేరుకోగా, త్వరలోనే విద్యార్థులకు అందజేయనున్నారు. ఆలస్యమైనా ఉచిత పుస్తకాలు అందుబాటులోకి రావడంపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## స్వర్ణ వార్డు కార్యాలయాన్ని తనిఖీ చేసిన మండల పరిషత్ ఏవో

సత్యవేడు, జూలై 25 ప్రభాతవార్త:

సత్యవేడు మండలం దాసుకుప్పం స్వర్ణ వార్డు కార్యాలయాన్ని మండల పరిషత్ పరిపాలనాధికారి త్రివిక్రమరావు తనిఖీ చేశారు. శనివారం ఆయన స్వర్ణ వార్డు కార్యాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు, పౌరులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఇక్కడ స్వర్ణ వార్డు కార్యాలయంలో గ్రామ మహిళా పోలీసుగా లక్ష్మి, ఏఎన్ఎంగా సుమలత, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్‌గా నాగేశ్వరి, వెటర్నరీ అసిస్టెంట్‌గా నవీన్ పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అయితే మెడికల్ సెలవులపై వెళ్లిన నాగేశ్వరికి సంబంధించి హాజరు పట్టికలో నమోదు చేయకపోవడంపై ఆయన సిబ్బందిని ప్రశ్నించారు. అదే సమయంలో ఏవో త్రివిక్రమరావు సిబ్బంది హాజరు పట్టికలో స్వయానా నాగేశ్వరి మెడికల్ సెలవుపై ఉన్నట్టు నమోదు చేశారు. కాగా డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడం వల్ల ప్రజలకు సేవలు అందించలేకపోతున్నట్టు ఈ సందర్భంగా సిబ్బంది ఏవోకు విన్నవించారు. అలాగే వెటర్నరీ అసిస్టెంట్ నవీన్ అందుబాటులో లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. పైగా మూమెంట్ రికార్డుని సక్రమంగా నిర్వర్తించాలని స్వర్ణ వార్డు సిబ్బందిని కోరారు. డిజిటల్ అసిస్టెంట్ బాధ్యతలను చూడడానికి ఒకరికి ఇన్‌చార్జి బాధ్యతలను త్వరలోనే అప్పగిస్తామన్నారు.

## 29న ఏకం ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

వరదయ్యపాలెం, జూలై 25, ప్రభాతవార్త



గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల 29న మండలంలోని బత్తలవల్లూరులోని ఏకం ఒనెస్ ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏకం వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ ప్రకటించారు. శుక్రవారం వరదయ్యపాలెంలోని గోపవరంలోని లోక ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహిం చిన పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గురుపౌర్ణమి సందర్భంగా ఈ నెల 29న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముక్తి గురువు కృష్ణజీ, ప్రీతాజీ దంపతులు భక్తులకు దర్శనమివ్వనున్నారని పేర్కొన్నారు. అలాగే ఆ రోజు ఉదయం 6 గంటలకు ఏకం ఆలయంలో ఏర్పాటు చేసిన రాశి వనం ప్రారంభం, 7 గంటలకు సర్వ ఐశ్వర్యసిద్ధి హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం దర్శనం అనంతరం రాత్రి 9 గంటల నుంచి 10 గంటల వరకు సంగీత విభావరి, ధ్యానంతో కూడిన ఆనంద తన్మయం వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. 30 వేలకు పైగా భక్తులు హాజరుకానున్నారని, అందుకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## ఘనంగా డా. పి.సి. రాయులు జన్మదిన వేడుకలు

### వెయ్యి మందికి బట్టలు పంపిణీ, అన్నదానం
### సమాజ సేవలో డా. పి.సి. రాయులు సేవలు ఆదర్శనీయం
### ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ నాయుడు

వడమాలపేట, జూలై 25 ప్రభాతవార్త:




కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డా. పి.సి. రాయులు జన్మదిన వేడుకలను తిరుపతి జిల్లా వడమాలపేట మండలం పాడిరేడు గ్రామంలో సేవా కార్యక్రమాల నడుమ ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరిం చుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పేద ప్రజలకు అండగా నిలవాలనే సంకల్పంతో వెయ్యి మంది మహిళలకు చీరలు, వెయ్యి మంది పురుషులకు ధోతీలు, తువ్వాళ్లు పంపిణీ చేయడంతో పాటు వెయ్యి మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాల ద్వారా డా. పి.సి. రాయులు సమాజ సేవ పట్ల చూపుతున్న నిబద్ధత మరోసారి చాటిచెప్పబడింది. ఈ కార్యక్రమానికి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ అనేక సంవత్సరాలుగా విద్య, వైద్యం, పేదల సంక్షేమం వంటి రంగాల్లో విశేష సేవలు అందిస్తోందని ప్రశంసించారు. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. పి.సి. రాయులు సేవా తపన అభినందనీయమని కొనియాడారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చేయూత అందించే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. డా. పి.సి. రాయులు మాట్లాడుతూ జన్మదిన వేడుకలను ఆర్భాటంగా కాకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం తమ ట్రస్ట్ సంప్రదాయమని తెలిపారు. సమాజంలో వెనుకబడిన వారికి అండగా నిలవడం, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం, అవసరమైన వారికి చేయూత అందించడం కంటే గొప్ప సేవ మరొకటి లేదన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి పేద ప్రజలకు సేవలందించేందుకు ట్రస్ట్ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, సామాజిక సేవకులు, ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ డా. పి.సి. రాయులు ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు సమాజ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వ హించిన అన్నదానపెద్ద సంఖ్యలో నిరుపేదలు పాల్గొని భోజనం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ట్రస్ట్ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుపతిలో ఘనంగా నిస్సాన్ మాగ్నెట్ టర్బో టెక్టాన్




### ఎడిషన్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, జూలై 25 ప్రభాతవార్త

తిరుపతి–రేణిగుంట రహదారి లోని హైటెక్ నిస్సాన్ షోరూమ్‌లో శనివారం నిస్సాన్ మాగ్నెట్ టర్బో టెక్టాన్ ప్రత్యేక ఎడిషన్ కారును ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైటెక్ నిస్సాన్ మేనేజింగ్ డైరెక్టర్ సి. జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు చెరుకు నిరంజన్, సి. భారతి, సి. హోషిమా రెడ్డి, సి. ఆనిష్ రెడ్డి పాల్గొని నూతన మోడల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ సి. జగన్నాథరెడ్డి మాట్లాడుతూ నిస్సాన్ నుంచి విడుదలైన మాగ్నెట్ టర్బో టెక్టాన్ ఎడిషన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడిందన్నారు. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో కూడిన ఈ వాహనం 100 హెచ్‌పీ శక్తి, 166 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. నగర ప్రయాణాలతో పాటు సుదూర ప్రయాణాలకు అనువుగా ఉండేలా అత్యుత్తమ పనితీరు, ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. ఈ మోడల్‌లో వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్, వెంటిలేటెడ్ ముందు సీట్లు, డ్యూయల్ జోన్ ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, పనోరమిక్ సన్‌రూఫ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అలాగే లేన్ కీప్ అసిస్ట్, బ్లైండ్ స్పాట్ మానిటరింగ్ తదితర అత్యాధునిక డ్రైవర్ సహాయక భద్రతా వ్యవస్థలు ఈ కారుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ వాహనం ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర రూ.10.49 లక్షలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి బ్యాంక్ ఆఫ్ బరోడా పీఎం కె. కిషోర్‌బాబు, తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, సినీ నటులు ప్రదీప్, సరస్వతి, నిస్సాన్ సేల్స్ రీజినల్ మేనేజర్ జి.బి. ఆనంద్, జనరల్ మేనేజర్ ఎన్.వి.ఎస్., గేట్ కళాశాల చైర్మన్ టి. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన వాహనాన్ని పరిశీలించిన వినియోగదారులు, ఆటోమొబైల్ రంగ ప్రతినిధులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన నిస్సాన్ మాగ్నెట్ టర్బో టెక్టాన్

# పచ్చదనం పెంపునకు శ్రీ చైతన్య విద్యార్థుల ర్యాలీ




తిరుపతి విద్య, జూలై 25 ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి వృక్షారోపణను ప్రోత్సహించే ఉద్దేశంతో తిరుపతిలోని జీఎస్ మాడ వీధిలో గల శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నిర్వహిస్తున్న స్టూడెంట్ లివింగ్ ప్రోగ్రామ్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ సీఐ సంజీవ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల నరికివేత వంటి కారణాలతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే పచ్చని

## పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన
## మొక్కలు నాటి సందేశం

వాతావరణాన్ని భావితరాలకు అందించగలమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, సమాజంలో అవగాహన కల్పించే బాధ్యతను వారు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం సురేష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సామాజిక బాధ్యతతో పాటు ప్రకృతిపట్ల ప్రేమను పెంపొందించేందుకు స్టూడెంట్ లివింగ్ ప్రోగ్రామ్ కింద పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే అలవాటును పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ట్రాఫిక్ సీఐ సంజీవ్ కుమార్, ఏజీఎం సురేష్‌తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులు కూడా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ నాలుగు మాడ వీధుల మీదుగా కొనసాగింది. విద్యార్థులు చెట్లు నాటండి–పర్యావరణాన్ని కాపాడండి, పచ్చదనం పెంచుదాం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం, ప్రకృతిని రక్షిద్దాం వంటి నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, వృక్షారోపణ అవసరాన్ని వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్, డీన్ నరేంద్ర, సీ అండ్ ఎం ఇన్‌చార్జి దీపా, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు పిలుపునిచ్చారు.

